క్లుప్తంగా

బీసీజీ వ్యాక్సిన్‌తో అనేక ప్రయోజనాలు



బీసీజీ వ్యాక్సినేషన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న వైద్యాధికారులు

ఇందుకూరుపేట : అంతర్జాతీయ వైద్య సంస్థలు డబ్ల్యూహెచ్‌ఓ, యునిసెఫ్ సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా బీసీజీ వ్యాక్సిన్‌ను తయారు చేసిందని, దీని ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని రాష్ట్ర టీబీ అబ్జర్వర్ డాక్టర్ తహసీనా అన్నారు. మండలంలోని మైపాడు, జగదేవిపేట ఆరోగ్య కేంద్రాలను అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలితో కలిసి ఆమె గురువారం పరిశీలించారు. మైపాడు, లేబూరు, జగదేవిపేట గ్రామాల్లో క్షేత్రస్థాయిలో బీసీజీ వ్యాక్సిన్ వేయించుకున్న వారిని కలిసి ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్ ద్వారా ఊపిరితిత్తుల సమస్యలు, క్షయతో పాటు అనేక వ్యాధులు దూరం అవుతాయన్నారు. వ్యాక్సిన్ ఉపయోగాలపై వైద్య ఆరోగ్య సిబ్బంది విస్తృత స్థాయి ప్రచారం కలిగించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ విజయ్‌శంకర్, డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు, డాక్టర్ కిశోర్‌కుమార్, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ విజయ్‌కుమార్, జగదేవిపేట పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక తరలింపు



ముందురోజు బిల్లుతో ఇసుకను తరలిస్తున్న లారీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని మినగల్లు ఇసుకరీచ్‌లో నిబంధనలు తుంగలో తొక్కి యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారు. దీనిపై అధికారులకు సమాచారం ఉన్నా పట్టించుకోవడం లేదు. ముందురోజు బిల్లుతో ఇసుకను లోడ్ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇసుక లోడింగ్‌ను గురువారం తాత్కాలికంగా నిలిపినా టిప్పర్లు, లారీలకు లోడ్ చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. లోడు చేసిన టిప్పర్లు, లారీల బిల్లులను పరిశీలిస్తే అవి బుధవారం రోజు బిల్లులు అని తెలిశాయి. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు, ట్రాక్టర్ల యజమానులు కోరుతున్నారు.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ సమన్వయాధికారి హేమలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 – 25 విద్యా సంవత్సరానికి గెస్ట్, పార్ట్‌టైమ్ టీచర్లను నియమించాలని నిర్ణయించామని చెప్పారు. ఆసక్తి కలిగిన మహిళలు ఇంగ్లిష్‌లో బోధించేందుకు కొత్తకోడూరులోని గురుకుల పాఠశాలలో ఈ నెల 29వ తేదీ ఉదయం పది గంటలకు నిర్వహించే డెమో కార్యక్రమానికి ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. బుచ్చిరెడ్డిపాళెం గురుకుల పాఠశాలలో జేఎల్ ఫిజిక్స్, పీజీటీ సోషల్, పెద్దపవనిలో జేఎల్ కెమిస్ట్రీ, టీజీటీ జీవశాస్త్రం, కోడూరు పాఠశాలలో టీజీటీ ఇంగ్లిష్, టీజీటీ ఫిజికల్ సైన్స్, కండలేరు పాఠశాలలో పీజీటీ మ్యాథ్స్, టీజీటీ ఫిజికల్ సైన్స్, ఆదూరుపల్లిలో టీజీటీ జీవశాస్త్రంలో ఒక్కో పోస్టు చొప్పున ఖాళీగా ఉన్నాయని వివరించారు.

నూతన కార్యవర్గ ఏర్పాటు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీ ఎలక్ట్రిసిటీ ముస్లిం మైనార్టీ అసోసియేషన్ నెల్లూరు టౌన్ డివిజన్ కార్యవర్గ సమావేశాన్ని కోటమిట్టలోని ఏఆర్బీ ఫంక్షన్ హాల్లో గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ, డీఈఈ అల్తాఫ్ హాజరయ్యారు. అనంతరం అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నెల్లూరు డివిజన్ ప్రెసిడెంట్‌గా షాహిద్, సెక్రటరీగా అబ్దుల్ ఖయ్యూం, జాయింట్ సెక్రటరీగా నూరిన్, వైస్ ప్రెసిడెంట్‌గా షానవాజ్, ట్రెజరర్‌గా లతీఫ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ సెక్రటరీ నవాజ్‌జానీ, రీజినల్ సెక్రటరీ సయ్యద్ రఫీ, కోటమిట్ట ఏఈ నస్రూల్లా తదితరులు పాల్గొన్నారు.

సర్‌చార్జీల జమలో తీవ్ర జాప్యం

- ఏడాదికి పైగా రిజిస్ట్రేషన్ల ద్వారా రావల్సిన నిధులు నిల్
- ఎక్కడ జాప్యం నెలకొందో తెలియడం లేదంటున్న సెక్రటరీలు
- అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేసినా కానరాని ఫలితం
- పారిశుద్ధ్య సిబ్బందికి జీతాలు చెల్లించలేని స్థితిలో పంచాయతీలు



పొదలకూరు సచివాలయం

పొదలకూరు : రిజిస్ట్రేషన్ల ద్వారా పంచాయతీలకు అందాల్సిన సర్‌చార్జీల దామాషా నిధులు జమ కాక సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు అల్లాడిపోతున్నారు. ఎక్కడ జాప్యం జరిగిందో తెలియక సబ్‌ట్రెజరీ చుట్టూ సర్పంచులు, సెక్రటరీలు ప్రదక్షిణలు చేస్తున్నారు. భూములు, ప్లాట్లు, ఇతర క్రయ విక్రయాలు రిజిస్ట్రేషన్ చేసుకుంటే స్థానిక సంస్థలకు అంటే జెడ్పీ, మండలం, పంచాయతీలకు ఐదో వంతు నిధులు జమ చేస్తారు. అయితే జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ తంతు జరుగుతున్నా పొదలకూరు సబ్‌రిజిస్ట్రేషన్, సబ్‌ట్రెజరీ కార్యాలయాల పరిధిలోని మండలాల్లో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్నట్లు సర్పంచులు వెల్లడించారు. ఇందువల్ల పంచాయతీ పాలనలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొదలకూరులో ఉన్న సబ్‌ట్రెజరీ కార్యాలయ పరిధిలోకి పొదలకూరు మండలంతో పాటు రాపూరు మండలంలో కొన్ని పంచాయతీలు, చేజర్ల, కలువాయి మండలాలు వస్తాయి. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో పొదలకూరు, కలువాయి మండలాలు ఉన్నాయి. ఈ మండలాల పరిధిలోని పంచాయతీ సర్పంచ్‌లు, సెక్రటరీలు ప్రస్తుతం రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే నిధుల కోసం వెంపర్లాడుతున్నారు. పంచాయతీల్లో నిధులు లేకపోవడం వల్ల సర్‌చార్జీల ద్వారా అందే నిధుల వేటలో పడ్డారు.

ట్రెజరీలోనే జాప్యం

రిజిస్ట్రేషన్లు జరిగితే ప్రతి మూడు(క్వార్టర్లీ) మాసాలకొక పర్యాయం కార్యాలయ సిబ్బంది స్టేట్‌మెంట్ రూపంలో జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి పంపుతుంటారు. వారు ఆయా ట్రెజరీలకు స్టేట్‌మెంట్ పంపితే ఎస్‌టీఓ పంచాయతీలకు నిధులను విడుదల చేయడం ఆనవాయితీ. అయితే ఈ ప్రక్రియ ఎందుకనో జాప్యం జరుగుతున్నట్టు సర్పంచులు ఆరోపిస్తున్నారు. పొదలకూరు సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయం గూడూరు జిల్లా రిజిస్ట్రేషన్ కిందకు వస్తుంది. ఆయా కార్యాలయాల్లో తాము వాకబు చేస్తే ఎప్పటి స్టేట్‌మెంట్ అప్పుడే సబ్‌ట్రెజరీకు పంపుతున్నట్టు వెల్లడించారని చెబుతున్నారు. దీంతో సర్పంచులు సెక్రటరీలను వెంటబెట్టుకుని సబ్‌ట్రెజరీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే ఎస్‌టీఓ తమకు స్టేట్‌మెంట్ ఈ ఏడాది క్వార్టర్లీ వరకే అందినట్లుగా వెల్లడిస్తున్నట్టు తెలిపారు. సుమారు 18 మాసాలుగా రిజిస్ట్రేషన్ల ద్వారా పంచాయతీలకు జమ కావాల్సిన నిధులు ఇప్పటి వరకు రాలేదని సెక్రటరీలు పేర్కొంటున్నారు.

మేజర్ పంచాయతీలకు రూ.లక్షల్లో నిధులు

మేజర్ పంచాయతీలకు రూ.లక్షల్లో సర్‌చార్జీల నిధులు జమ కావాల్సి ఉంది. పొదలకూరు పంచాయతీలో లేఅవుట్లు అధికంగా ఉన్నందున రిజిస్ట్రేషన్లు బాగా జరిగాయి. ఈ నేపథ్యంలో పంచాయతీకు ఐదో వంతు దమాషా కింద రూ.లక్షల్లో నిధులు జమకావాల్సి ఉంది. అయితే గత 18 మాసాలుగా సర్‌చార్జీల నిధులు జమ కాకపోవడంతో పాలకమండలి అల్లాడిపోతోంది. పారిశుద్ధ సిబ్బందికి జీతాలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. సుమారు రూ.20 లక్షల నిధులు నిలిచిపోయినట్టు చెబుతున్నారు. ఫలితంగా ట్రెజరీ చుట్టూ తిరుగుతున్నా నిధులు జమకావడం లేదంటున్నారు. ఇదే పరిస్థితి చాలా పంచాయతీల్లో నెలకొందని, వెంటనే ఉన్నత స్థాయి అధికారులు జోక్యం చేసుకుని పంచాయతీలకు సర్‌చార్జీల నిధులు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

నాలుగు మాసాలే పెండింగ్

ఈ ఏడాది ఏప్రిల్ నుంచే తమ వద్ద రిజిస్ట్రేషన్ ద్వారా పంచాయతీలకు అందే నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎప్పటి నుంచి నిధులు జమ కాలేదో పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటాం. సర్పంచులు, సెక్రటరీలు వచ్చి అడుగుతున్నా నిబంధనల ప్రకారం నిధులు జమ చేస్తూనే ఉన్నాం. జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం ద్వారా తమకు ప్రతి మూడు మాసాలకొక పర్యాయం స్టేట్‌మెంట్ అందుతుంది. ఈ స్టేట్‌మెంట్‌ను పరిశీలించి వీలైనంత త్వరగా నిధులను జమ చేస్తాం.

– ఎస్‌కే కాలేషా, ఎస్‌టీఓ, పొదలకూరు



పొదలకూరు సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయం

పూర్వ విద్యార్థుల సహకారంతో అభివృద్ధి



పాఠశాలలో జరిగిన అభివృద్ధి పనుల గురించి వివరిస్తున్న పూర్వ విద్యార్థి

విడవలూరు : స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పాఠశాల హెచ్‌ఎం రమేష్‌బాబు అన్నారు. మండల కేంద్రమైన విడవలూరులోని జెడ్పీ పాఠశాలలో పూర్వ విద్యార్థులతో కలిసి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో 1972–73వ సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు సమష్టిగా పాఠశాలను అభివృద్ధి చేశారని తెలిపారు. పాఠశాలలో సైకిల్ స్టాండ్‌ను సోమవరపు జనార్దన్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి కలిసి దాదాపు రెండున్నర లక్షలతో నిర్మించారని, అదేవిధంగా వంకి పెంచలయ్య పాఠశాలకు 50 ఫ్యాన్లను వితరణ చేశారన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నాగపద్మ, పూర్వ విద్యార్థులు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి, వాసిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వి.చంద్రశేఖరయ్య, ఎం.అంకయ్య, ఎస్.శోభన్‌బాబురెడ్డి, ఎం.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన బాలుడి మృతి

మనుబోలు : మండల పరిధిలోని జాతీయ రహదారిపై ఇటీవల గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన పోలయ్య అనే బాలుడు తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. మనుబోలు చింతల చెరువు ప్రాంతానికి చెందిన గిరిజనుడు ఆకుల చిన్నబయ్య కుమారుడు పోలయ్య(16)ను ఈనెల 20న మనుబోలు సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పోలయ్యను చికిత్స నిమిత్తం తిరుపతి రూయా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు మనుబోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



వర్సిటీ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఇన్‌చార్జి వీసీ తదితరులు

వెంకటాచలం : పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విక్రమ సింహపురి యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు అన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీ ఆవరణలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పారిశ్రామికీకరణ కారణంగా పచ్చదనం అంతరించిపోతోందని, దీంతో వాతావరణంలో కాలుష్యం పెరిగిపోతోందన్నారు. ఈ క్రమంలో విరివిగా మొక్కలు నాటడం ద్వారా కాలుష్యాన్ని నివారించాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో మానవులు మనుగడ సాగించాలంటే మొక్కలు నాటడం తప్పనిసరి అన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కులు నాటాలని సూచించారు. వర్షాలు కురుస్తున్నందున మొక్కలు నాటేందుకు ఇదే అనుకూలమైన సమయమన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి, ఎస్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ ఉదయ్‌శంకర్, మహేంధర్‌రెడ్డి, సుజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న సర్పంచ్ కదురు సుబ్బయ్య

తోటపల్లిగూడూరు : గ్రామాల్లో మరుగుదొడ్లు, తాగునీటి సమస్యలను అధికారులు పరిష్కరించాలని పాపిరెడ్డిపాళెం సర్పంచ్ కదురు సుబ్బయ్య సూచించారు. మండలంలోని పాపిరెడ్డిపాళెం గ్రామ సచివాలయంలో మరుగుదొడ్లు, తాగునీటి సమస్యలపై గురువారం గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మరుగుదొడ్లు, తాగునీటి వసతి అత్యంత కీలకమన్నారు. ఈ రెండు సమస్యలు గ్రామాల్లో ఎక్కడా లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులు, పాలకులపై ఉందన్నారు. ముఖ్యంగా జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ తాగునీటి కుళాయి కనెక్షన్లు వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోడూరు చంద్రారెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు తిరువళ్లూరు రామసుబ్బయ్య, స్థానిక నాయకులు కడివేటి సుధాకర్‌రెడ్డి, చెరుకూరి హరిబాబు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, వీఆర్వో సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

డైట్ కళాశాలలో ‘శిక్షా సప్తాహ్’



వివిధ రాష్ట్రాల ప్రజల వస్త్రధారణల్లో ఛాత్రోపాధ్యాయులు

ఇందుకూరుపేట : శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పల్లిపాడులో ఉన్న డైట్ కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఛాత్రోపాధ్యాయులు వివిధ ప్రాంతాల ప్రజల వస్త్రధారణలతో ఆయా రాష్ట్రాల సంస్కృతి సాంప్రదాయలు తెలియజేసేలా కార్యక్రమాలు జరిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ పి.రమేష్ మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం రూపొందించి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ, రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్షా విభాగాల ఆధ్వర్యంలో వారం రోజుల పాటు శిక్షా సప్తాహ్ కార్యక్రమం దేశవ్యాప్తంగా జరుగుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, విజయ్‌చంద్ర, శివ, ఎస్‌బీ దాస్ తదితరులు పాల్గొన్నారు.

సాయినాథునికి విశేష పూజలు

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. శాశ్వత ఉభయకర్తల గోత్రనామాలతో పూజలు, సాయంత్రం భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు.

• **మనుబోలు :** మండలంలోని మనుబోలు, జట్లకొండూరు గ్రామాల్లోని సాయిబాబా మందిరాల్లో గురువారం విశేష పూజలు చేశారు. అర్చకులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ సాయిబాబా విగ్రహానికి పుష్పాలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. మనుబోలు బాబా మందిరంలో మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. ఉభయకర్తలుగా దండు చంద్రశేఖర్‌రెడ్డి, రాజేశ్వరమ్మ దంపతులు వ్యవహరించారు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి

వెంకటాచలం : ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని తిప్పవరప్పాడు పంచాయతీ గొట్లపాళెంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గొట్లపాళెం గ్రామానికి చెందిన టీడీపీ నేత మందల శ్రీహరి(55) ఇంటి అవసరాల కోసం ట్రాక్టర్‌లో మట్టి తరలిస్తున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్‌ను స్టార్ట్‌లోనే ఉంచి వెనుక వైపు అడ్డుగా ఉన్న వాటిని తొలగిస్తుండగా ఒక్కసారిగా ట్రాక్టర్ వెనుకకు కదిలింది. దీంతో అతను ట్రాక్టర్ చక్రాల కింద పడి మరణించారు. అక్కడే ఉన్న అతని భార్య ధనమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న టీడీపీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గొట్లపాళెం చేరుకుని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



కొడవలూరులో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కొడవలూరు : కొడవలూరులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఎంపీడీఓ వి.ప్రద్యుమ్నకుమార్ గురువారం పరిశీలించారు. గ్రామంలోని మురుగునీటి కాలువల్లో పూడిక తీయడంతో పాటు రోడ్ల వెంబడి పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాలను పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. ఈ పనులను పరిశీలించిన ఎంపీడీఓ స్థానిక పంచాయతీ కార్యదర్శి జి.రాధాకృష్ణను అభినందించారు. గ్రామంలో తరచూ పారిశుద్ధ్య పనులు చేపట్టడం ద్వారా దోమలను నివారించి సీజనల్ వ్యాధులు అరికట్టవచ్చని తెలిపారు. వర్షాకాలం కావడంతో అన్ని పంచాయతీల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

• ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్



ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలించి సూచనలిస్తున్న ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్

కొడవలూరు : ఆధార్ ప్రత్యేక శిబిరం ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వి.ప్రద్యుమ్నకుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ కచ్చితమైన వివరాలతో ఆధార్ ఉండడం ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు. ఇప్పటికీ ఆధార్ చేయించుకోని వారుంటే వెంటనే నమోదు చేసుకోవాలని చెప్పారు. ఎవరికైనా ఆధార్‌లో అక్షర దోషాలు, తప్పులు ఉంటే సరిచేసుకోవాలన్నారు. ఆధార్‌లో ఎలాంటి తప్పులు, తడకలు లేకుండా సరి చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎంపీడీఓ వెంట ఎంఈఓ జి.వసంతకుమారి, ఈఓపీఆర్డీ వి.డేవిడ్, మండల రిసోర్స్ కో–ఆర్డినేటర్ వి.మనోజ్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు జి.రాధాకృష్ణ, అంకమరాణి ఉన్నారు.

గంబూసియా చేపలతో దోమల నియంత్రణ



నిల్వనీటిలో గంబూసియా చేపలను వదులుతున్న అధికారులు

పొదలకూరు : పట్టణంలోని పలు ప్రాంతాల్లో దోమలను నివారించేందుకు ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది కలిసి మురుగు కాలువలు, నిల్వనీటిలో గంబూసియా చేపలను గురువారం వదిలారు. వారంరోజుల క్రితం ఒక పర్యాయం ఈ చేపలను వదలగా, రెండో పర్యాయం మరిన్ని చేపలు వదిలి దోమలు వాటి లార్వాను నిర్మూలించేందుకు ప్రయత్నిస్తున్నారు. గంబూసియా చేపలు దోమల గుడ్లను తినడం వల్ల ప్రమాదకరమైన డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, మెదడు వాపును కలిగించే దోమలు అంతమవుతాయన్నారు. ప్రజలు వారం రోజులకు ఒకసారి నిల్వ నీటిని పారబోసి పాత్రలు, తొట్టిలను శుభ్రం చేసుకోవడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు ఎం.రాధాకుమారి, సాని శివప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ సుమాంజలి, ఆశావర్కర్ ఉష పాల్గొన్నారు.

అంధత్వ నివారణ అందరి బాధ్యత



కంటి సమస్యలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీలేఖ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పాఠశాలల్లోని విద్యార్థుల్లో అంధత్వాన్ని గుర్తించి నివారించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని కంటి వైద్య నిపుణురాలు ఎం.శ్రీలేఖ అన్నారు. పట్టణంలోని మండల విద్యాశాఖ కార్యాలయంలో విద్యార్థులకు వచ్చే కంటి సమస్యలపై జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ఉపాధ్యాయులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీలేఖ మాట్లాడుతూ పిల్లల్లో వచ్చే హస్వదృష్టి, దీర్ఘదృష్టి, గ్లకోమా, కండ్లకలక తదితర వ్యాధులపై ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలన్నారు. తద్వారా పిల్లలకు తొందరగా చికిత్స అందించేందుకు వీలుంటుందన్నారు. త్వరలోనే పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్లు, పరికరాలు అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ దిలీప్‌కుమార్, మండలంలోని అన్నిపాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలు కళాశాలలపై చర్యలకు డిమాండ్

వెంకటాచలం : నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌ఎస్‌ఎఫ్ మండలాధ్యక్షుడు నలబాలపు వెంకటాద్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు కాకుటూరులోని వీఎస్‌యూలో ఇన్‌చార్జి వీసీ సారంగం విజయ్‌భాస్కర్‌రావుకు గురువారం వినతపత్రం అందజేశారు.

సాగు హక్కు చట్టంపై అవగాహన అవసరం

నెల్లూరు సిటీ: సాగు హక్కు చట్టంపై కౌలు రైతులకు అవగాహన అవసరమని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి పేర్కొన్నారు. దేవరపాళెంలో రైతులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సొంతంగా పొలం లేని రైతులు ఈ చట్టం ద్వారా పంట రుణాలు, బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర సదుపాయాలను పొందవచ్చని చెప్పారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులను సంప్రదించి పంట సాగు హక్కు పత్రం కోసం నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలను అందజేశారు. ములుమూడిలోని వరి పొలాలను పరిశీలించారు. సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను తెలియజేశారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకుడు శ్రీనివాసులు, మండల వ్యవసాయాధికారి నాగమోహన్, గ్రామ ఉద్యాన సహాయకుడు విష్ణు, గ్రామ వ్యవసాయ సహాయకులు అనూష తదితరులు పాల్గొన్నారు.